# చిలకలూరిపేటలో నకిలీ సిగరెట్ల దందా

## ఊపిరితిత్తులు గుల్ల.. ఖజానాకు కన్నం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 20:
చిలకలూరిపేట : సరదా సరదా సిగరెట్టు.. ఇది తాగకపోతే నాపై ఒట్టు...అనే పాత సినిమా పాట ఒకప్పుడు ధూమపాన ప్రియులకు కాలక్షేపంగా ఉండేది. కానీ నేడు అదే సిగరెట్టు ప్రాణసంకటంగా మారుతోంది. చిలకలూరిపేట కేంద్రంగా సాగుతున్న నకిలీ సిగరెట్ల వ్యాపారం సామాన్యుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోంది. ఏది అసలో, ఏది నకిలీయో తెలియక పొగ తాగుతున్న వారు ఆసుపత్రుల పాలవుతుండటం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**నకిలీలకు నిలయంగా పేట?**

గతంలో ప్రకాశం జిల్లా మరియు స్థానిక అధికారులు సమన్వయంతో దాడులు నిర్వహించి, చిలకలూరిపేటలో రెండు లారీల నకిలీ సిగరెట్లను పట్టుకున్న ఉదంతం మరువక ముందే, మళ్లీ ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ముఖ్యంగా 'పారిస్' బ్రాండ్ సిగరెట్లు ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించకుండానే ప్రతి చిన్న బడ్డీ కొట్టులోనూ దర్శనమివ్వడం గమనార్హం.

**సిండికేట్‌గా మారి దందా..**

పట్టణంలో నలుగురు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి, రహస్య గోడౌన్లలో నకిలీ నిల్వలను ఉంచుతూ అధిక లాభాల కోసం అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేవలం పారిస్ మాత్రమే కాకుండా, మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న విల్స్ ఫ్లేక్,ఫిల్టర్,గోల్డ్




ఫ్లేక్ కింగ్స్ (లైట్ & స్ట్రాంగ్)వంటి ప్రముఖ బ్రాండ్ల ప్యాకింగ్‌ను అచ్చం ఒరిజినల్‌లాగే ముద్రించి నకిలీలను విక్రయిస్తున్నారు. వీటిని తాగడం వల్ల తీవ్రమైన దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయని బాధితులు వాపోతున్నారు.

**అండర్ సెల్లింగ్.. అదనపు బాదుడు**

బడ్జెట్ సమయంలో ధరలు పెరుగుతాయనే ముందస్తు అంచనాతో, ఐటీసీ వంటి కంపెనీల నుండి భారీగా స్టాక్ కొనుగోలు చేసిన డీలర్లు, వాటిని బయటకు తీయకుండా 'అండర్ సెల్' చేస్తున్నారు. పెరిగిన ధరలకు, పాత ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు?**

గతంలో భారీగా పట్టుబడిన రికార్డులు ఉన్నా, ప్రస్తుతానికి తనిఖీలు నిలిచిపోవడంతో ఈ మాఫియా రెచ్చిపోతోంది. సంబంధిత అధికారులు ఉన్నారా...లేరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చిలకలూరిపేటలోని గోడౌన్లపై దాడులు నిర్వహించి నకిలీ సిగరెట్ల అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# రాఘవ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం.

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి,20:
మండల కేంద్రమైన భట్టిప్రోలు లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో రాఘవ పెట్రోల్ బంకును శుక్రవారం ప్రారంభించారు. పెట్రోల్ బంకును ప్రారంభించిన స్థానిక రెవెన్యూ తహసిల్దార్ మేక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అవసరమైన పెట్రోల్ డీజిల్ లను వినియోగదారులకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా బంక్ యాజమాన్యం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.వ్యవసాయ వినియోగ యంత్రాలకు నాణ్యమైన డీజిల్, ద్విచక్ర వాహన దారులకు కారు టాక్సీ లారీ తదితర వాహనాలకు ఎల్లప్పుడూ పెట్రోల్ బంకు అందుబాటులో ఉండే విధంగా యాజమాన్యం చర్యలు చేపట్టుతున్నదని ఆయన తెలిపారు. నూతనంగా ప్రారంభమైన పెట్రోల్ బంకు ప్రతినిధి జంపాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో పెట్రోల్ బంక్ లో పనిచేసిన సిబ్బందిని పూర్తిగా ప్రక్షాళన చేసి నూతన వ్యక్తులను పనులకు కేటాయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటీ అనగాని శాంత లక్ష్మి, బంక్ యజమాని జంపాని గౌతమ్ కుమార్ గౌడ్,జిల్లా గౌడ సంఘం సెక్రటరీ చెన్ను శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి జంపాని శ్రీనివాసరావు,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,అనగాని ఏడుకొండలు గ్రామ ప్రజలు,వాహన శోధకులు పాల్గొన్నారు

# అన్న క్యాంటీన్ల ద్వారా జరుగుతున్న ఆహార సరఫరాని కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేయాలి..,

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 20.
ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే ట్రస్ట్ దృష్టికి తీసుకురావాలని ఏపి అన్న క్యాంటీన్ చారిటబుల్ ట్రస్ట్ సిఈఓ వంశీధర్ పోతుల కోరారు. నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్ల నిర్వహణపై ఏర్పాటు చేసిన కమిటీలతో శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో క్యాంటీన్ ఛారిటబుల్ ట్రస్ట్ సిఈఓ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా క్యాంటీన్ల సిఈఓ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.5కే రుచికరమైన ఆహారాన్ని పేదలకు అందించాలనే బృహత్ లక్ష్యంతో ముఖ్యమంత్రి అన్న క్యాంటీన్లను ప్రారంభించారని, కమిటి సభ్యులు క్యాంటీన్లను ఆహార సరఫరా సమయంలో పరిశీలించాలన్నారు. మౌళిక వసతుల్లో లోపాలు ఉంటే స్థానిక అధికారులకు, ఆహారంలో సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే క్యాంటీన్లను ప్రభుత్వం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నందున, నగరంలో ఎవరైనా పుట్టిన రోజు లేదా ప్రత్యేక రోజుల్లో క్యాంటీన్లకు ఆహారంకు అయ్యే ఖర్చులు ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం కమిటి సభ్యులు దాతల పేర్లు క్యాంటీన్ లో బోర్డ్ ఏర్పాటు చేసి అందులో డిస్ప్లే చేస్తే ఎక్కువ మంది ముందుకు వచ్చే అవకాశం ఉందని పలు సూచనలు చేశారు.



సమావేశంలో జిఎంసి అన్న క్యాంటీన్ ల నోడల్ అధికారి, ఉపా సెల్ పిఓ సింహాచలం, క్యాంటీన్ల కమిటి సభ్యులు పాల్గొన్నారు

# నేడు విద్యుత్‌కు అంతరాయం

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి, 20:
భట్టిప్రోలు మండలం పెదపులివర్రు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని రేపల్లె విద్యుత్ శాఖ డీఈ శ్యామ సుధాకర్ బాబు శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం గం 8 ల నుండి మధ్యాహ్నం గం 2:00 ల వరకు పెదపులివర్రు సబ్ స్టేషన్ నందు గల ఆర్ డి ఎస్ ఎస్ పనుల కారణంగా తూర్పు పాలెం,ఓలేరు, గొరిగపూడి, కోళ్ల పాలెం,పెసర్లంక, పెదలంక,చింతమోటు, మరియు పెదపులివర్రు గ్రామ పరిధిలో విద్యుత్తు కు సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు.విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహృదయంతో సహకరించవలసిందిగా ఆయన కోరారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యార్హత కొరకు అప్లికేషన్ల స్వీకరణ: మండల విద్యాధికారి నాగరత్నం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 20:
ఎడ్లపాడు : మండలంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతి ఉచిత విద్య అర్హత పొందేందుకు పేద విద్యార్థులు ఈనెల20 నుండి మార్చి10వ తేదీ వరకు విద్యార్థుల నమోదు ప్రక్రియను చేపడతారని ఎడ్లపాడు మండల విద్యాధికారి ఎంవి నాగరత్నం బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.ఒకటవ తరగతిలో ఉచిత విద్య కొరకు ప్రవేశ పరీక్షలకు తమ పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్లు సమర్పించవలసి ఉంటుందని అన్నారు.ఈపరీక్షలకు హాజరు పరిచే చిన్నపిల్లల వయసు 2020 జూన్ 2 నుండి 2021 మార్చి31వ తేదీలోపు జన్మించినవారు అర్హులని తెలిపారు. విద్యా హక్కు చట్టం 2009ని అనుసరించి ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించవలసి ఉన్నందున 2026-2027 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల అయిందని లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని అనాధలు,హెచ్ఐవి బాధిత చిన్నారులకు, ఎస్.టి.ఎస్.సి.బి.సి, మైనార్టీలకు, సీట్లు కేటాయిస్తారని తెలిపారు. చిరునామా ధ్రువీకరణ కొరకు ఆధార్ కార్డు,తల్లిదండ్రుల ఓటర్ ఐడి, రేషన్ కార్డు,ఉపాధి హామీ జాబ్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్ లో ఏదో ఒకటి సమర్పించవచ్చని తెలిపారు. తమ పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలతో గ్రామ వార్డు సచివాలయాలు విద్యా కేంద్రాలలో పాఠశాలల్లో నుండి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆన్లైన్ హోటల్లో ప్రైవేట్ పాఠశాలల నమోదు ప్రక్రియను మార్చి 10వ తేదీలోపు పూర్తి చేయనున్నారని మార్చి 17వ తేదీన విద్యార్థుల అర్హత నిర్ధారణ జరుగుతుందని మొదటి విడత లాటరీ మార్చ్ 25న జరుగుతున్నది రెండో విడత లాటరీ ఏప్రిల్ 12వ తేదీన జరుగుతుందని తెలిపారు కావున ఒకటవ తరగతిలో పిల్లలను చేర్చాలనుకున్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు.



# చిలకలూరిపేటలో బస్సుల కొరత

## గంటల తరబడి ప్రయాణికుల నిరీక్షణ



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 20:
చిలకలూరిపేట : బస్టాండ్‌లో బస్సుల రాక కోసం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండాల్సిన నరసరావుపేట - చిలకలూరిపేట రూట్‌లో, ప్రస్తుతం గంట దాటినా బస్సు జాడ లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అటు గుంటూరు వైపు వెళ్లే ప్రయాణికులు కూడా సుమారు 45 నిమిషాలకు పైగా వేచి చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం చిలకలూరిపేట రాజాపేటలో 'తండ్రి సన్నిధి మహాకూటమి' సభలు జరుగుతున్న నేపథ్యంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఉన్న తక్కువ బస్సుల్లోనే జనం పరిమితికి మించి ఎక్కడంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఈ మహాకూటమి ముగిసే వరకు అయినా ఆర్టీసీ అధికారులు స్పందించి, అదనపు బస్సులు మరియు ప్రత్యేక సర్వీసులను నడపాలని స్థానికులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.

# విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన.

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి, 20:
మండలం పరిధిలోని ఐలవరం జెడ్పీహెచ్ పాఠశాల లో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు,పొగాకు వినియోగం,నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ సీఐ రెడ్రౌతు దివాకర్, ఎస్ఐ రాజశ్రీ,భట్టిప్రోలు కానిస్టేబుల్స్ గంగాధర్, అనగాని ఏడుకొండలు హాజరై విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, పొగాకు వలన కలిగే ఆరోగ్య సమస్యలు వాటి నివారణపై అవగాహన కల్పించారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహనరావు ,తాండవ కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



